నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I | హైదరాబాద్, శనివారం 18 జనవరి 2025 | SANGAREDDY

కాంగ్రెసోళ్ల మోసాన్ని గ్రామసభల్లో ఎండగట్టాలి

ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు పథకాల్లో ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వం

- అర్హులను గుర్తించేది గ్రామ సచివాలయంలోనా... హైదరాబాద్ సచివాలయంలోనా?
- కోటి మంది వ్యవసాయ కూలీలు ఉంటే...6 లక్షల మందికే పథకం వర్తింపు
- ఆత్మీయ భరోసా పథకాన్ని అర్హులైన రైతు కూలీలందరికీ అమలుచేయాలి
- గుంట భూమి ఉన్న రైతులను రైతుకూలీలుగా గుర్తించక పోవడంపై ప్రభుత్వాన్ని నిలదీయాలి
- సిద్దిపేట నియోజకవర్గ బీఆర్ఎస్ శ్రేణులతో మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు టెలీ కాన్ఫరెన్స్

టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, జనవరి 17: ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు పథకాల్లో ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గ్రామసభల్లో ప్రజలు ఎండగట్టాలని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం సిద్దిపేట నియోజకవర్గం బీఆర్ఎస్ శ్రేణులతో హరీశ్‌రావు టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలను మోసం చేస్తుందని, ఇప్పటికే 6 గ్యారంటీలను అటకెక్కించిందని, ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల విషయంలో ప్రజలను ఘోరంగా మోసం చేస్తున్నదని మండిపడ్డారు.. గ్రామాల్లో వీటిపై గ్రామసభలు నిర్వహిస్తున్నారని, ఈ సభల్లో బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొని అర్హులైన పేదలకు, రైతులకు న్యాయం జరిగేలా చూడాలని, ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీయాలన్నారు.. ఆత్మీయ భరోసా పేరు మీద రైతులను ప్రభుత్వం మోసం చేస్తున్నదని, ఆత్మీయ భరోసా పథకాన్ని కోతలు విధించకుండా అమలు చేయాలని అడగాలన్నారు. రాష్ట్రంలో 50 లక్షల ఈజీఎస్ కార్డులు ఉంటే, కోటి రెండు లక్షల మంది ఉపాధి హామీ కూలీలుగా పనిచేస్తున్నారన్నారు. సిద్దిపేట జిల్లాలో 2లక్షల మంది ఉపాధి హామీ కూలీలు ఉంటే ప్రభుత్వం తెచ్చిన నిబంధనలతో 75000 మందికే వర్తిస్తుందని, మిగతా లక్షా 25వేల మంది కూలీల సంగతి ఏంటన్నారు. వీరంతా రోజూ పనికి వెళ్లే నిరుపేదలని, అందులో ఎస్సీ ఎస్టీ, బీసీలో ఎక్కువగా ఉంటారన్నారు. గుంట భూమి ఉన్న రైతులను ఉపాధి హామీ కూలీలుగా గుర్తించమని ప్రభుత్వం చెప్పడం దురదృష్టకరమన్నారు. ఎకరంలోపు భూమి ఉన్న రైతుకు కూడా ఈ పథకం వర్తించాలని గ్రామ సభలో అడగాలన్నారు. ఒక్క గుంట భూమి ఉన్నా కూలీ కాదని, ఉపాధి హామీ పథకంలో ఈ ఏడాది 20 రోజులు పని దినాలు ఉంటేనే కూలీగా గుర్తింపు అనే నిబంధన కూడా సరైనది కాదన్నారు. అనారోగ్య సమస్యలతోనూ ఇతర సమస్యలతోనూ 60 ఏండ్లు నిండిన రైతుకు, పనికి వెళ్లని కూలీలను ఉపాధి హామీ కూలీలుగా గుర్తించారని ప్రభుత్వం చెబుతున్నదన్నారు. ఈజీఎస్ పథకంలో కూలీలు 60 ఏండ్లు దాటితే కార్డు కోల్పోతారు. ఈ పథకంలో ఈజీఎస్ నిబంధన విధించకుండా అమలు చేయాలి. రైతు కూలీలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలు చేయాలన్నారు. గ్రామాల్లో వ్యవసాయ కూలీలు కోటి మంది ఉంటారని, కానీ, ప్రభుత్వం 6 లక్షల మందికే ఈ పథకం వర్తింపచేలా చేస్తున్నదని హరీశ్‌రావు చెప్పారు. కూలీలను గుర్తించేది.. హైదరాబాద్ సచివాలయంలోనా.. గ్రామ సచివాలయం వద్ద..? అని గట్టిగ నిలదీయాలన్నారు. రైతు భరోసా రూ.10 వేలును రూ.15 వేలు చేస్తామని ఎన్నికల్లో ప్రగల్భాలు పలికి, కోతలు... ఎగవేతలతో రూ.12 వేలు ఇస్తున్నారన్నారు.. ఎగొట్టిన వానకాలం రూ.6 వేలు సంగతి ఏందీ అని వానకాలం పైసలు ఇవ్వాలని గ్రామ సభలో తీర్మానం చేపించాలన్నారు. న్యాయంగా ఉండే వారికి రైతుభరోసా వచ్చేలా చుడాలని, అర్హులైన రైతులందరినీ గుర్తించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో ఇంటి స్థలం ఉండి కిరాయికి ఉన్న వారికి, గుడిసెల్లో ఉండే వారికి, కవర్లు కప్పు ఉన్న ఇండ్లకు, అనాథలకు, ఒంటరి మహిళలకు, దివ్యాంగులకు స్థలం ఉంటే ఇది వర్తిస్తుందని, అలాంటి వారిని గుర్తించి అర్హులైన వారికి అందేలా చూడాలన్నారు.. రేషన్ కార్డు విషయంలో ఇప్పటికి గ్రామాల్లో, పట్టణంలో కులగణనకు సంబంధం పెట్టి కొంత మందికి మాత్రమే వచ్చాయని, ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారి విషయం, కేసీఆర్ ప్రభుత్వంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారి సంగతి ఏంటి అని గ్రామసభల్లో నిలదీయాలని బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. గ్రామసభల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని ప్రజల వైపు నిలబడాలని, నిజమైన, అర్హులైన పేదలందరికీ న్యాయం జరిగేలా చూడాలని.. ప్రభుత్వం చేస్తున్న మోసాలను ఎండగట్టాలని హరీశ్‌రావు పిలుపునిచ్చారు.

నవోదయ పరీక్షకు సర్వం సిద్ధం

రామాయంపేట, జనవరి 17: నవోదయ ప్రవేశ పరీక్షకు విద్యాశాఖ సర్వం సిద్ధం చేసింది. శుక్రవారం ఎంఈవో శ్రీనివాస్ మంజీరా విద్యాలయంలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రానికి వెళ్లి పరిశీలించారు. శనివారం జరిగే పరీక్ష కోసం నెంబర్లు వేశారు. ఒకే పరీక్షా కేంద్రంలో ఏ, బీ సెక్షన్లు ఏర్పాటు చేసినట్లు, విద్యార్థులు పరీక్షా కేంద్రానికి 10గంటల వరకు రావాలని సూచించారు.

పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

నర్సాపూర్, జనవరి 17: నవోదయ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు చేసినట్లు క్లస్టర్ లెవల్ అధికారి డాక్టర్ రవి, బ్లాక్ లెవల్ అధికారి తారాసింగ్ తెలిపారు. నర్సాపూర్ బ్లాక్ లెవల్‌లో రెండు పరీక్ష కేంద్రాలు ఉన్నాయని, జడ్పీహెచ్‌హెస్ బాయ్స్, విష్ణు హైస్కూల్‌లో పరీక్ష రాస్తారన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి సకాలంలో రావాలని సూచించారు.

రామాయంపేట: నవోదయ పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో శ్రీనివాస్

రిజర్వేషన్ల కోసం ఆశావహుల ఎదురుచూపు

గ్రామాల్లో వేడెక్కుతున్న రాజకీయాలు

పంచాయతీ ఎన్నికలకు సన్నద్ధమవుతున్న సంగారెడ్డి జిల్లా అధికార యంత్రాంగం

- జిల్లాలో 5,732 పోలింగ్ కేంద్రాలు, 3,285 బ్యాలెట్ బాక్సులు
- 10 లక్షలకుపైగా బ్యాలెట్ పేపర్ల ముద్రణకు ఏర్పాట్లు
- 7 వేల పోలింగ్ సిబ్బంది అవసరం అవుతారని అంచనా
- ఎన్నికల కోసం ఇప్పటి నుంచే భారీగా ఖర్చు చేస్తున్న ఆశావహులు

సంగారెడ్డి, జనవరి 17(నమస్తే తెలంగాణ): పంచాయతీలకు త్వరలో ఎన్నికలు జరుగుతాయన్న ప్రచారం గ్రామాల్లో పొలిటికల్ హీట్ పెంచుతున్నది. అధికార యంత్రాంగం పంచాయతీ ఎన్నికలకు సన్నద్ధం అవుతుండడంతో పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్న ఆశావహులు ఎన్నికలకు ఇప్పటి నుంచే సన్నద్ధం అవుతున్నారు. ప్రభుత్వం ప్రకటించనున్న పంచాయతీ రిజర్వేషన్ల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. కులగణన సర్వే నివేదిక ఆధారంగా రిజర్వేషన్లు ఖరారు చేసిన తర్వాత పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం చెబుతుండడంతో ఆశావహుల్లో రిజర్వేషన్లపై ఉత్కంఠ నెలకొంది. త్వరలో పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తారన్న ప్రచారం సాగుతుండటంతో సర్పంచ్‌కు పోటీ చేయాలనుకునే నేతలు ప్రజల్లో మమేకం అయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటినుంచే గ్రామాల్లో పెద్దఎత్తున ఖర్చు పెడుతున్నారు. సర్పంచ్‌గా పోటీ చేయాలనుకుంటున్న నాయకులు గ్రామాల్లో పెండ్లిండ్లు, పండుగలు, జాతర్లకు ఆర్థిక సహాయం చేస్తూ, అన్నివర్గాల మెప్పు పొందే ప్రయత్నం చేస్తున్నారు. మాజీ సర్పంచ్‌లతో పాటు గతంలో సర్పంచ్ పదవికి పోటీ చేసి ఓటమిపాలైన నాయకులు పంచాయతీ ఎన్నికలకు సిద్ధం అవుతున్నారు. రిజర్వేషన్లు కలిసివస్తాయని మరికొంత మంది నాయకులు పంచాయతీ బరిలో నిలిచేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో గ్రామాల్లో రాజకీయాలు క్రమంగా వేడెక్కుతున్నాయి. సంగారెడ్డి జిల్లాలో మొత్తం 647 పంచాయతీలు ఉన్నాయి. జిల్లాలో ఇటీవల 11 పంచాయతీలు మున్సిపాలిటీల్లో విలీనం అయ్యాయి. అంతే మొత్తంలో కొత్తగా 11 పంచాయతీలు ఏర్పాటు అయ్యాయి. దీంతో జిల్లాలో పంచాయతీల సంఖ్య యథావిధిగా 647 గానే ఉంది. ఆయా పంచాయతీల పరిధిలో మొత్తం 5,732 పంచాయతీ వార్డులు ఉన్నాయి. జిల్లాలోని 647 పంచాయతీ సర్పంచ్‌ల పదవీకాలం ముగిసి ఏడాది కావస్తుంది. దీంతో అందరి దృష్టి పంచాయతీ ఎన్నికలపైనే నెలకొంది. ప్రభుత్వం త్వరలోనే పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు సమాయత్తంగా ఉన్నట్లు తెలుస్తుంది. ఇటీవల పంచాయతీల ఓటర్ల జాబితాను ప్రకటించటంతోపాటు అధికార యంత్రాంగం పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లను వేగవంతం చేస్తుంది.

10 లక్షల బ్యాలెట్ పత్రాలు... 3,285 బ్యాలెట్ బాక్సులు

పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం వేగంగా ఏర్పాట్లు చేస్తుంది. ఇటీవల ఎన్నికల సంఘం పంచాయతీ ఓటర్ల జాబితాను ప్రకటించింది. సంగారెడ్డి జిల్లాలో 14,40,151 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 7,21,186 మంది పురుష, 7,18,827 మహిళా ఓటర్లు ఉన్నారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం పంచాయతీ శాఖ అధికారులు 5,732 పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. పంచాయతీ శాఖ అధికారులు 3,285 బ్యాలెట్ బాక్సులను సమకూర్చుకుంటున్నారు. అదనంగా మరిన్ని బ్యాలెట్ బాక్సులు అవసరమైతే వాటిని సిద్ధం చేసుకుంటున్నారు. ఎన్నికల కోసం 10 లక్షల బ్యాలెట్ పత్రాల ముద్రణ ప్రారంభించారు. మొత్తం 30 గుర్తులతో బ్యాలెట్ పత్రాలను ముద్రిస్తున్నారు. సర్పంచ్‌లకు 5 లక్షలు, వార్డు సభ్యులకు 5 లక్షల చొప్పున 10 లక్షల బ్యాలెట్ పత్రాల ముద్రణ పనులు ప్రారంభం అయ్యాయి. పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం 7,300 మంది పోలింగ్ సిబ్బంది అవసరం అవుతారని పంచాయతీ శాఖ అంచనా వేసింది. అందుకుఅనుగుణంగా ఎన్నికల సిబ్బంది జాబితాను అధికారులు సిద్ధం చేస్తున్నారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.



పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లపైనే అందరి దృష్టి నెలకొంది. పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేద్దామనుకుంటున్న నాయకులు పంచాయతీ రిజర్వేషన్లు ఎప్పుడు ప్రకటిస్తారని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. గతంలో పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్‌పై నాయకులు, ఆశావహులు ముందస్తుగానే అంచనా వేసేవారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కులగణన అనంతరం పంచాయతీ రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకుంటామని ప్రకటించింది. దీంతో జిల్లాలో పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే ఆశావహులు ప్రభుత్వం రిజర్వేషన్లపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా సర్పంచ్, ఉపసర్పంచ్ పదవి ఆశిస్తున్న నాయకులు రిజర్వేషన్ల కోసం ఎదురుచూస్తూనే, మరోవైపు ఎన్నికలకు సన్నద్ధం అవుతున్నారు. ఎన్నికల్లో తాము బరిలో ఉంటామని చెప్పుకుంటూ ప్రజల మద్దతు కూడగట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. పంచాయతీ ఎన్నికల కోసం జోరుగా ఇప్పటినుంచే ఖర్చు పెడుతున్నారు. దీంతో గ్రామాల్లో రాజకీయాలు వేడెక్కుతున్నాయి.

ట్రిపుల్ ఆర్‌పై మాటతప్పిన మంత్రి కోమటిరెడ్డి

- అలైన్‌మెంట్ మార్చాలి.. లేదంటే మూడింతల పరిహారం ఇవ్వాలి
- గజ్వేల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట బాధితుల ధర్నా



గజ్వేల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ట్రిపుల్ఆర్ బాధితులు

గజ్వేల్, జనవరి 17: ట్రిపుల్ఆర్(రీజినల్ రింగ్ రోడ్డు) అలైన్‌మెంట్ మార్చుతామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బాధితులకు ఇచ్చిన మాటను తప్పారని, ప్రభుత్వం ట్రిపుల్ఆర్ బాధితులను మోసం చేస్తున్నదని గజ్వేల్ డివిజన్ పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన బాధితులు మండిపడ్డారు. శుక్రవారం ట్రిపుల్ఆర్ (రీజినల్ రింగ్‌రోడ్డు) బాధితులు ఆర్డీవో చంద్రకళను కలిసిన తర్వాత కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. బాధితులతో మాట్లాడుతామని చెప్పిన అధికారులు, కార్యాలయానికి వచ్చిన తర్వాత పరిహారంపై ఎలాంటి స్పష్టత ఇవ్వడం లేదన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు చెందిన పలువురు రైతులు మాట్లాడుతూ.. ట్రిపుల్ఆర్ బాధితులంతా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిస్తే తప్పకుండా అలైన్‌మెంట్ మార్చుతామని చెప్పి, నేటికీ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, ఈ విషయంతో సీఎం రేవంత్ కూడా మాట తప్పారన్నారు. సావడానికైనా సిద్ధమే కానీ, సాగు భూములు మాత్రం ట్రిపుల్ఆర్‌కు ఇవ్వబోమంటున్నారు. శవాలపై రోడ్డు వేసుకోండి. కానీ, తమ భూములు ఇచ్చే ప్రసక్తే లేదన్నారు. రాత్రి సమయంలో 60 నుంచి 70 మంది అధికారులు, పోలీసులతో గ్రామాల్లో తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకు ఎంతకైనా తెగిస్తామన్నారు. గజ్వేల్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని పీర్లపల్లి నుంచి బేగంపేట వరకు ఎకరాకు రూ.2కోట్లు పలుకుతుందని, ప్రభుత్వం ఎకరాకు మూడింతల పరిహారం, ఇంటికో ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలన్నారు. ట్రిపుల్ఆర్‌ను 60 కిలోమీటర్ల వరకైనా పొడగించి అలైన్‌మెంట్ మార్చాలన్నారు. లేదంటే సంగారెడ్డి నుంచి భువనగిరి మీదుగా జాతీయ రాహదారి మార్గంలోనే వేయాలన్నారు. ధర్నాలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



నర్సంపల్లిలో గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

హామీలకే పరిమితమైన ప్రభుత్వం

- అభివృద్ధికి దూరమవుతున్న గ్రామాలు
- అధికారులు గ్రామాల్లో పర్యటించి సమస్యలు పరిష్కరించాలి
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

నర్సంపల్లి తండాలో సీసీ రోడ్డుకు భూమిపూజ చేస్తున్న కొత్త ప్రభాకర్‌రెడ్డి

చేగుంట, జనవరి 17: కాంగ్రెస్ ప్రభుత్వం హామీలకే పరిమితమవ్వడంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందని, అధికారులు గ్రామాల్లో పర్యటించి ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మెదక్ జిల్లా నార్సింగి మండల పరిధిలోని నర్సంపల్లిలో పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. నర్సంపల్లి తండా, వల్లూర్ గ్రామాల్లో సీసీ రోడ్లకు కొబ్బరికాయ కొట్టి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన పనులకు సైతం నిధులు ఇవ్వడం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పల్లెలు, గ్రామాలు, తండాలు అభివృద్ధికి నోచుకోవడం లేదని, గ్రామాల్లో ప్రజలు పడుతున్న ఇబ్బందులను అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రజలు తిరగబడే రోజు దగ్గరలోనే ఉందని, బీఆర్ఎస్ ప్రజల పక్షాన ఉద్యమించడానికి సిద్ధంగా ఉన్నదన్నారు. పంచాయతీ రాజ్ అధికారులు ఏ ఒక్కరూ ఫోన్లో అందుబాటులో ఉండడం లేదన్నారు. రోడ్ల కోసం రూ.3 కోట్ల ప్రతిపాదనలు పంపగా, వాటన్నింటినీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మైలారం బాబు, మాజీ ఎంపీపీ చిందం సబిత, మాజీ జడ్పీటీసీ బాణపురం కృష్ణారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సుజాత, మాజీ సర్పంచ్‌లు భ్రతీయ నాయక్, బొమ్మగారి సత్యం, ఆనందాస్ మహేశ్వరి, నాయకులు భూపతిరాజు, బిక్యానాయక్, భాషానాయక్, రోమాల రాజు, వాహిద్, అంబరీషా, నర్సింహులు తదితరులున్నారు.

కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం

సిద్దిపేట వ్యవసాయ మార్కెట్‌లో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

- ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్

సిద్దిపేట, జనవరి 17: కందులను ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.7,550 మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో కలెక్టర్ మనుచౌదరి, అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి నాగరాజుతో కలిసి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రైతులు మద్దతు ధరకు కందులను అమ్ముకోవాలన్నారు. గతంలో పత్తి, వడ్లు, పొద్దుతిరుగుడు పంటలను కొనుగోలు చేశామని చెప్పారు. వడ్లు కొనుగోలు చేసి 48గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేశామన్నారు. జనవరి 26 నుంచి వ్యవసాయ యోగ్యమైన భూములకు రైతుభరోసా ఇవ్వనున్నట్లు తెలిపారు. రైతుభరోసాను ఎకరానికి రూ.12,000లకు పెంచామన్నారు. భూమిలేని ఉపాధి హామీ కూలీలకు రూ.12000 ఇస్తామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వే జరుగుతుందని, సర్వే పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇండ్లు ఇస్తున్నామన్నారు. వీటితో పాటు కొత్త రేషన్ కార్డులు, పేర్ల మార్పిడి చేసుకునే వారు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో సదానందం, మార్కెట్ కమిటీ సెక్రటరీ వెంకటయ్య పాల్గొన్నారు.

అర్హులకు ప్రభుత్వ పథకాలు అందాలి

- సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి

గుర్రాలగొందిలో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

నారాయణరావుపేట, జనవరి 17: రైతు భరోసా, రేషన్ కార్డుల సర్వేను సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం గుర్రాలగొందిలో కలెక్టర్ మనుచౌదరి శుక్రవారం పరిశీలించారు. అర్హులైన లబ్ధిదారులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా అధికారులు పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో సదానందం, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో శ్రీరాములు, తాసీల్దార్ అహ్మద్ ఖాన్, ఎంపీవో శ్రీనివాస్, ఆర్ఐ అర్జున్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

సర్వేను పరిశీలించిన కలెక్టర్

చిన్నకోడూర్, జనవరి 17: సిద్దిపేట జిల్లా చిన్నకోడూర్ మండలం రామునిపట్లలో రైతు భరోసా, రేషన్ కార్డుల సర్వేను కలెక్టర్ మనుచౌదరి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రేషన్ కార్డుల సర్వేను క్షుణ్ణంగా పరిశీలించాలని, రైతుభరోసా సర్వేను పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో సదానందం, తాసీల్దార్, ఎంపీడీవో తదితర అధికారులు ఉన్నారు.

అనర్హుల గురించి మేమెట్ల జెప్తం

వార్డు సమావేశాలపై ఇందిరమ్మ కమిటీ సభ్యుల ప్రశ్నల వర్షం

- నచ్చజెప్పేందుకు ఇబ్బందులు పడ్డ అధికారులు

మున్సిపల్‌లో సమావేశానికి హాజరైన ఇందిరమ్మ వార్డు కమిటీ సభ్యులు

హుస్నాబాద్‌టౌన్, జనవరి 17: ''ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు ఎవరికి ఇవ్వాలనేది మేం ఎట్ల జెప్తం... అందరినీ చూసుకుంటూ వాళ్లకు ఇండ్లు ఇవ్వరాదు.. వీళ్లకు ఇయ్యాలే అని ఎట్లజెప్పాలి... గట్ల జెప్పి మళ్లీ ఓట్లకు ఎట్లపోతం... మమ్మల్ని వాళ్లు తిట్టుకోరా... ఊకుంటరా''... ఇది ప్రభుత్వం నియమించిన ఇందిరమ్మ కమిటీ సభ్యులు అధికారులకు వేసిన ప్రశ్నలు... సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం కౌన్సిలర్లు, వార్డు అధికారులు, ఇందిరమ్మ వార్డుకమిటీ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత వెంకన్న, కమిషనర్ టి.మల్లికార్జున్‌గౌడ్ మాట్లాడుతూ ఈనెల 21వతేదీ నుంచి రోజూ ఐదువార్డుల చొప్పున సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశాల్లో లబ్ధిదారులను ఎంపిక చేస్తామని ఇందులో అర్హులు ఎవరు, అనర్హులు ఎవరు అనే విషయాన్ని కమిటీ సభ్యులు తెలుపాలని కమిషనర్ టి.మల్లికార్జున్‌గౌడ్ సూచించారు. దీనిపై పలువురు ఇందిరమ్మ కమిటీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇండ్ల జాబితా మాకు ఎందుకు ఇయ్యలేదు... అవి ఇస్తే ఎవరికి ఇయ్యాలో అనేది చూసి ట్రిక్ పెడతం అని వారు కమిషనర్‌కు వివరించారు. ప్రభుత్వం నుంచి మాకు ఇంకా జాబితా రాలేదని చెప్పగా ఇంకెప్పుడు ఇత్తరు గట్లాంటప్పుడు మమ్మల్ని ఎందుకు పెట్టించ్రు అని వారు నిలదీశారు. సమావేశాలు నిర్వహించే ప్రదేశంలో బాక్స్ పెట్టాలని అందులో చిట్టీలు రాసి వేస్తామని కమిటీ సభ్యులు సూచించగా ప్రభుత్వం నుంచి అలాంటి ఆదేశాలు వస్తే చెప్తామని కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్ స్పష్టం చేశారు. మాకు తెల్వకుండా సభ్యులుగా పెట్టి జనంలో మమ్మల్ని బద్నాం చేసుడు తప్ప ఒరిగేది ఏమీలేదంటూ పలువురు ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో చైర్‌పర్సన్, కమిషనర్ కమిటీ సభ్యులకు నచ్చచెప్పేందుకు ప్రయత్నాలు చేసినా సభ్యులు మాత్రం అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజల భాగస్వామ్యంతో సమావేశాలు నిర్వహించాలని, అర్హులైన వారిని ఎంపిక చేయాలని చైర్‌పర్సన్ కోరారు. సమావేశంలో వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్లు కొంకట నళినిదేవి, బోజు రమాదేవి, పెరుక భాగ్యారెడ్డి, జనగామ రత్నమాల, గోవిందు రవీందర్, బొల్లి కల్పన, కోమటి స్వర్ణలత, మ్యాదరబోయిన వేణు, బొజ్జ హరీశ్, వల్లపు రాజు, చిత్తారి పద్మ, భూక్యా సరోజనతో పాటు పలువురు వార్డు కౌన్సిలర్లు, వార్డు అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

19న కొమురవెల్లిలో పట్నం వారం

- 50వేలకు పైగా భక్తులు వచ్చే అవకాశం
- అన్ని ఏర్పాట్లు చేస్తున్న ఆలయవర్గాలు

చేర్యాల, జనవరి 17: సిద్దిపేట జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొమురవెల్లి మల్లన్న ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాలకు సిద్ధమైంది. గత డిసెంబర్ 28న కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించిన ఆలయ వర్గాలు, ఇప్పుడు బ్రహ్మోత్సవాల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఆలయ ఆచారాలు, సంప్రదాయాల ప్రకారం సంక్రాంతి తర్వాత వచ్చే మొదటి ఆదివారంతో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. బ్రహ్మోత్సవాల్లో పట్నం వారం, లష్కర్ వారం, మహా శివరాత్రి రోజున నిర్వహించే పెద్దపట్నం, అగ్నిగుండాలు ప్రముఖ కార్యక్రమాలు. ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయం, రాజగోపురం, గదులకు రంగులు వేయించడంతో సుందరంగా కనిపిస్తున్నాయి. ఈనెల 19న నిర్వహించే పట్నం వారంతో ఉత్సవాలు ప్రారంభమై 12 ఆదివారాలు కొనసాగుతాయి. 12 ఆదివారాలతో పాటు ప్రత్యేక కార్యక్రమాలకు భక్తులు భారీసంఖ్యలో తరలివస్తారు. భక్తులకు విశిష్ట దర్శనం, శ్రీఘ్రదర్శనం, ధర్మ దర్శనం కల్పించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈవో కె.రామాంజనేయులు తెలిపారు. పట్నం వారానికి ఆదివారం అధిక సంఖ్యలో హైదరాబాద్ భక్తులు వచ్చి స్వ